ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీ అధ్యక్షుడిగా..

కింగ్ జాన్సన్ కొయ్యడ ఏకగ్రీవ ఎన్నిక



సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీ గేటెడ్ కమ్యూనిటీ (స్కోవా)లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో..అధ్యక్షుడిగా కింగ్ జాన్సన్ కొయ్యడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని స్కోవా ఎన్నికల సంఘం ఆదివారం అధికారికంగా వెల్లడించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు జాన్సన్ మాట్లాడుతూ..గత నాలుగేళ్ల నుంచి మెయింటెనెన్స్ పెంచకుండా..అభివృద్ధి పనుల్ని చేపట్టడం వల్ల నివాసితులు తమపై నమ్మకం ఉంచారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి సురేష్ ,కోశాధికారి ఎం.నవీన్ మాట్లాడుతూ..త్వరలో పలు అభివృద్ధి పనుల్ని చేపడతామని చెప్పారు.

వీరే నూతన కమిటీ సభ్యులు

అధ్యక్షుడిగా కింగ్ జాన్సన్ కొయ్యడ, ఉపాధ్యక్షుడిగా హిమాన్షు, ప్రధాన కార్యదర్శి సురేష్, కార్యదర్శి సతీష్ వావ్ధానే, జాయింట్ సెక్రటరీ దీపక్ ఖత్రీ, ట్రెజరర్ ఎం నవీన్, జాయింట్ ట్రెజరర్ అంకుర్ అగర్వాల్, కమిటీ సభ్యులుగా సింధూరి, మధుమితా నాయక్, ధనుంజయ్ పాణిగ్రాహి, అర్ధెందు శేఖర్ దాస్, కె హిమబిందు, నితిన్ మిశ్రా, ఆనంద్ పాండే, శామ్యూల్ బీరా ఎన్నికయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మియాపూర్: పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌కు చెందిన గాలయ్యగౌడ్‌కు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలనకు ఆకర్షితులైన పలువురు పార్టీలో చేరుతున్నారని పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని కార్యాలయంలో 19వ డివిజన్ బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ నందిగామ మహేష్‌ముదిరాజ్ మిత్ర బృందంతో కలిసి పార్టీలో చేరగా హన్మంతరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను అమలుచేస్తోందని, ముఖ్యంగా యువత అభ్యున్నతికి ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బట్టతో తయారు చేసిన సంచులను వాడాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ పర్యావరణ పరిరక్షణ కమిటీ 320డి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం లయన్స్ జిల్లా 320 క్యాబినెట్ నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డైరెక్టర్ వంశీధరబాబు హాజరై మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులను పూర్తిగా నిషేధించాలని సూచించారు. సభకు హాజరైన ప్రతి ఒక్కరికి బట్ట సంచులను అందజేశారు. లయన్ సూరిరాజ్, విజయలక్ష్మీ, అనంతరెడ్డి పాల్గొన్నారు.



బట్ట సంచులు వాడాలంటూ అవగాహన కల్పించిన లయన్ అన్నెం కోటిరెడ్డి, డైరెక్టర్ వంశీధరబాబు

ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌ను పరిశీలించిన అధికారులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై వరుసగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజినీర్, ట్రాఫిక్ ఇంజినీర్ సెల్ విభాగం అధికారులు సోమవారం ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. ఫ్లైఓవర్‌పై జరుగుతున్న ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఫ్లై ఓవర్‌పై స్పీడ్ లిమిట్‌ను సూచిస్తూ సైన్ బోర్డుల ఏర్పాటు, రెండు వైపులా 5 ఇంచ్‌ల మేర స్పీడ్‌ను కంట్రోల్ చేసే రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు, ట్రాఫిక్ సైన్ బోర్డులు, చెట్ల కొమ్మల తొలగింపు తో పాటు స్పీడ్ లిమిట్, ఓవర్ టేకింగ్ కంట్రోల్, ఫ్లై ఓవర్ మొదట్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ కృష్ణ చైతన్య, ట్రాఫిక్ ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గిఫ్ట్ ఓచర్ పేరుతో సైబర్ మోసం..

రూ. 2 లక్షల 50 వేలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: గిఫ్ట్ ఓచర్ పేరిట సాఫ్ట్ వేర్ ఉద్యోగి నుంచి రూ.2 లక్షల 50 వేలు కాజేశారు సైబర్ కేటుగాళ్లు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 17వ తేదీన ఆపిల్ ప్లే స్టోర్‌లో గిఫ్ట్ ఓచర్లు కొనుగోలు చేస్తే నగదు రెట్టింపు వస్తాయని మెసేజ్ వచ్చింది.దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా నమ్మి తన వివరాలు ఇచ్చి, ఓచర్ కొనుగోలుకు పలు దఫాలుగా రూ.2 లక్షల 50 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తర్వాత రెట్టింపైన నగదు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.




బోనాల సంబరాలు

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



శేరిలింగంపల్లి: ఆషాఢమాస బోనాల వేడుకల్లో భాగంగా సోమవారం శేరిలింగంపల్లి తారానగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు వైభవంగా జరిగింది. తారానగర్ తుల్జాభవానీ ఆలయం, పోచమ్మ ఆలయాల నుంచి ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. యువకుల కేరింతలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాలతో ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో..

ఆదర్శనగర్‌లో బోనాల వేడుకల్లో భాగంగా ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు చింతకింది రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



రాయదుర్గంలో ..ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి




శేరిలింగంపల్లి తారానగర్ పోచమ్మ ఆలయం నుంచి బయల్దేరిన ఫలహారం బండి ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, కళాకారుల నృత్యాలు

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్ డిపో- 2 పరిధిలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమస్యలతో పాటు సలహాలు తెలియజేయాలన్నారు.ప్రయాణికులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు 9959226420 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మియాపూర్-2 డిపో మేనేజర్ వెంకటేశం కోరారు.

కూకట్‌పల్లి డిపో పరిధిలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కూకట్‌పల్లి డిపో డీఎం హరికి ఫోన్ ద్వారా మీ సమస్యలను ,సలహాలను అందజేయవచ్చని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు సెల్ నెంబర్ 9959226151 నంబర్‌లో సంప్రదించవచ్చు.అలాగే కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్- 2, హెచ్‌సీయూ, మేడ్చల్ ప్రాంత ప్రయాణికులు తమ సమస్యలను డయల్ యువర్ ఆఫీసర్ ద్వారా మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 9959226148 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయ నిర్మాణానికి గాను సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి లక్ష రూపాయలను సోమవారం విరాళంగా అందించారు. నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

మార్కెటింగ్ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిధుల కొరతతో వ్యవసాయ మార్కెట్ యార్డులో పనులు నిలిచిపోయాయని నిధులు మంజూరు చేయాలని మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డులో 20 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో 168 దుకాణాల నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందని మంత్రికి తెలిపారు. నిధుల కొరతతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని చెప్పారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి నాగేశ్వరరావు త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఓపెన్ జిమ్‌ల నిర్వహణేదీ..?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు వ్యాయామం చేసుకోవడానికి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో లక్షలాది రూపాయలతో ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. తర్వాత వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో జిమ్ పరికరాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని విరిగిపోయాయి. దాంతో అక్కడి వచ్చే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

2.105 కిలోల డ్రై గంజాయి స్వాధీనం

బంజారాహిల్స్: హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం, జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి ఓ యువకుడు పెద్ద మొత్తంలో డ్రై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన యశ్ అగర్వాల్ గత కొంతకాలంగా ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తెలిసిన కస్టమర్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో మాటువేశారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న యశ్ అగర్వాల్‌ను ఆపి సోదా చేయగా 2.105 కిలోల డ్రై గంజాయి బ్యాగ్‌లు దొరికాయి. దీంతో నిందితుడిని అరెస్టు చేసి బైక్‌తో పాటు గంజాయిని సీజ్ చేశారు.

లీకేజీలు.. నీటి వృథా

మంచినీటి పైపులు వేసిన మూణ్నాళ్లకే లీకవుతున్న వైనం

ఆల్విన్‌కాలనీ: వాటర్‌వర్క్స్, జీహెచ్‌యంసీ అధికారుల సమన్వయ లోపంతో నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 ప్రధాన రహదారిలో మంచినీటి ప్రధాన పైపులైన్ శిథిలావస్థకు చేరుకోవటంతో రెండు నెలల క్రితం నూతన పైపులైన్ వేశారు. ఐతే పనుల్లో నాణ్యత లోపించటంతో కొద్ది రోజులకే లీకేజీలతో మంచినీరు వృధాగా రోడ్లపై ఏరులై పారుతోంది. సుమారు వారం రోజులుగా తాగునీటి పైపులైన్ లీకేజీతో వందల గ్యాలన్ల తాగునీరు రోడ్ల పాలవటంతో పాటు నీరు పారుతున్న రహదారి వాహనాల తాకిడికి గుంతలు పడ్డాయి.దీంతో వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు తాగునీటి పైపులైన్‌లో రహదారిపై ఉన్న చెత్త చేరి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. కాగా లీకేజీలు ఉన్న ప్రాంతంలోని ప్రధాన రహదారిలో జీహెచ్‌యంసీ మాన్‌సూన్ సిబ్బంది గుంతలు పూడుస్తున్నారు. లీకేజీలు అరికట్టాక గుంతలు పూడిస్తే ఫలితం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

పాపిరెడ్డినగర్‌లో...

కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ ప్రధాన రహదారిలో మంచినీటి పైపులైన్ వాల్వ్ లీకయి తాగునీరు వృథాగా పోతోంది. సుమారు నెల రోజులుగా లీకవుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. పలుమార్లు సిబ్బందికి తెలిపినా కనీసం మరమ్మతులు కూడా చేయటం లేదని స్థానికులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం. కలుషితనీటితో రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




ఆల్విన్‌కాలనీ ఫేజ్- 1, పాపిరెడ్డినగర్ ప్రధాన రహదారిలో లీకవుతున్న ప్రధాన మంచినీటి పైపులైన్



గుంతలు పూడుస్తున్న మాన్‌సూన్ సిబ్బంది

వెంటబడుతున్నాయ్..

కరిచేస్తున్నాయ్

తప్పించుకోబోయి ప్రమాదాల బారిన వాహనదారులు



- మియాపూర్‌లో వీధి కుక్కల స్వైరవిహారం
- దీప్తిశ్రీనగర్ కాలనీ సమీపంలో డంపింగ్ యార్డ్
- యార్డ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కుక్కల సంచారం
- అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో బస్తీలు, కాలనీలలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బయటకు రావాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. పిల్లలను తీసుకుని నడిచి వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని, ఎపుడు దాడి చేస్తాయోననే భయం వేస్తోందని కాలనీలవాసులు పేర్కొంటున్నారు. ఇటీవల ఒకే రోజు నలుగురిపై దాడి చేశాయని చెప్పారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని తెలిపారు. కొన్నిచోట్ల గుంపులు గుంపులుగా ఉంటూ ద్విచక్ర వాహనదారుల వెంబడి పడుతుండడంతో తప్పించుకోబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నారులు సైతం కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్నారని రేబిస్ సోకే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- మియాపూర్ మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిలో గత కొన్ని సంవత్సరాలుగా డంపింగ్ యార్డు కొనసాగుతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా వెలువడే చెత్తను ఆటోల ద్వారా తీసుకువచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఇక్కడి నుండి టిప్పర్‌ల ద్వారా జవహర్‌నగర్‌కు తరలిస్తు ఉంటారు.
- డంపింగ్ యార్డ్ దగ్గర చెత్త గుట్టలుగుట్టలుగా పేరుకుపోవడంతో కుక్కలు ఆహారం కోసం ఇక్కడ తిరుగాడుతున్నాయి .
- డంపింగ్ యార్డు సమీపంలోని దీప్తిశ్రీనగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, పీఏనగర్, స్టాలిన్‌నగర్ , ఎంఏనగర్, పీఆర్‌ఎన్‌క్లేవ్, మక్తమహబూబ్‌పేట, స్వర్ణపురి కాలనీ, శాంతినగర్ కాలనీతో పాటు పలు కాలనీలలో తిరుగాడుతున్నాయి.
- కాలనీ, బస్తీలలో అనేక ప్రాంతాల్లో ప్రజలపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మరోపక్క చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- గత నెల రోజుల కిందట మక్తమహబూబ్‌పేట గ్రామానికి చెందిన 5 సంవత్సరాల బాలుడిపై కుక్కలు దాడి చేసి లాక్కెళ్లి డంపింగ్ యార్డు సమీపంలో పారవేశాయి. బాలుడు మృత్యువాత పడ్డాడు. అదేవిధంగా పీఏనగర్ కాలనీలో ఒకే రోజు నలుగురిని గాయపరిచాయి.
- సంఘటన జరిగిన తర్వాత రోజు కుక్కలను పట్టేందుకు హడావిడిచేసి తదనంతరం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెలువడుతున్నాయి.
- బస్తీ, కాలనీలలో పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతూ గాయపరుస్తున్నాయని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మియాపూర్‌లోని డంపింగ్ యార్డు సమీప ప్రాంతాలలో ఉన్న వీధి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని వారు కోరుతున్నారు.

నేడు హెచ్‌సీయూలో సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌ను మంగళవారం 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఇనీషియేటివ్ (లైఫ్)' అనే థీమ్‌తో నిర్వహించనున్నారు. 'వికసిత్ భారత్-2047'లో భాగంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)చే ప్రారంభించబడింది. వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక చిక్కులు, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంధన భద్రత, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై వివిధ దేశాల విద్యార్థి ప్రతినిధులు చర్చించనున్నారు. దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.ఈ కార్యక్రమానికి హెచ్‌సీయూ అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిట్టేడి కృష్ణారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

జలమండలి అధికారుల వివరాలు..

హఫీజ్‌పేట్: హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి శేరిలింగంపల్లి డివిజన్‌లో మంచినీటి, సివరేజ్ సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయవచ్చు..

శేరిలింగంపల్లి డివిజన్ జనరల్ మేనేజర్ బ్రిజేష్ :	9989989679
మాదాపూర్ సబ్ డివిజన్	
శరత్‌కుమార్‌రెడ్డి (డీజీఎం, మాదాపూర్) :	9989988370
బి. యాదయ్య (మేనేజర్, మాదాపూర్) :	9154297400
నరేందర్‌రెడ్డి (మేనేజర్, గచ్చిబౌలి) :	7331185784
అభిషేక్ (మేనేజర్, నల్లగండ్ల) :	9154867438
సందీప్‌కుమార్ (మేనేజర్, కొండాపూర్):	9550731232
విక్రమ్‌రెడ్డి (మేనేజర్, డోయన్స్):	9989989382
చందానగర్ సబ్ డివిజన్ వెంకటేశ్వర్లు (డీజీఎం, మియాపూర్)	: 9989997518
వి. సాయిచరిత (మేనేజర్, మియాపూర్):	9154866702
ఎస్‌వీఎస్ సుబ్రమణ్యంరాజు (మేనేజర్, చందానగర్)	: 9989989045
బిక్కులాల్ (మేనేజర్, దీప్తిశ్రీనగర్):	7995010492
పూర్ణేశ్వరి(మేనేజర్, హఫీజ్‌పేట్):	7331185747
ఆర్సీపురం సబ్ డివిజన్ శివకృష్ణ (డీజీఎం):	7337350848
మంచినీటి ట్యాంకర్ కోసం :	155313

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు పరిశీలన



రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కాశీనాథ్

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను సుమారు రూ.26.6 కోట్లతో చేపట్టడం జరిగిందని సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ఆర్ యుసీసీ మెంబర్ డి.కాశీనాథ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను స్టేషన్‌మాస్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, కాంగ్రెస్ నాయకురాలు శిరీష తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసివనం అపార్టుమెంట్ ఎదురుగా ట్రాఫిక్ రద్దీతో ప్రమాదాలు జరుగుతున్నాయని శేరిలింగంపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ ,కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు సోమవారం ట్రాఫిక్ ఏసీపీ, జీహెచ్‌యంసీ డిపార్టుమెంట్ సభ్యులంతా తులసివనం చేరుకొని అక్కడి ట్రాఫిక్‌ను పరిశీలించారు. అపార్టుమెంట్ ఎదురుగా వేగంగా వచ్చిపోయే వాహనాలను అరికట్టడానికి స్పీడ్ బ్రేకర్స్, డివైడర్లను ఏర్పాటు చేయాల్సిందిగా శిరీష విన్నవించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, సీఐ, ఎస్ఐ, జీహెచ్‌యంసీ అధికారులు, తులసివనం వాసులు పాల్గొన్నారు.

పార్కులో నిలిచిన వర్షపు నీరు



నిజాంపేట్: పార్కుల నిర్వహణ విషయంలో సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కులో వరదనీరు నిలిచిపోయింది. పార్కు చిన్నపాటి కుంటను తలపిస్తుండటంతో వాకర్స్, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వరదనీరు చేరి తాము ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పార్కులో వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



హఫీజ్‌పేట్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓల్డ్ ఎంఐజీ నల్లగండ్ల అండర్‌బ్రిడ్జి కింద గుర్తు తెలియని వృద్ధుడు (65) శనివారం ఉదయం పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనం అతడిని గమనించి పరిశీలించగా గాయాలతో పడి ఉండడం గుర్తించారు. వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్ సహాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఒంటిపై నల్ల ప్యాంటు, బ్లూ కలర్ షర్ట్ ఉన్నాయన్నారు. అతడి వివరాలు తెలిస్తే చందానగర్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.